బుధవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, శాక్స్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి

రైతుబంధును భిక్ష అంటావా?

- అన్నదాతలను భిక్షగాళ్లతో జమకడతవా?
- పీసీసీ చీఫ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- రైతులను అవమానించినవారు బాగుపడలే
- రేవంత్, రాహుల్‌కు రైతుల గోసేం తెలుసు? : మంత్రి నిరంజన్‌రెడ్డి

వ్యవసాయ కళాశాలలు 5	ఉద్యాన కళాశాలలు 1
4 వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలు	ఉద్యాన పాలిటెక్నిక్‌లు 1

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): అక్షయ పాత్రలాంటి రైతుబంధు పథకాన్ని భిక్షగా అభివర్ణించి, అన్నదాతలను భిక్షగాళ్లతో జమకట్టిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. చరిత్రలో రైతులను అవమానించిన వారెవరూ ఇంతవరకు బాగుపడలేదని అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, శాక్స్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి రైతులు భిక్షగాళ్లుగా కనిపిస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్, రాహుల్‌కు రైతుల గోసలు ఏం తెలుసని ప్రశ్నించారు. కొల్లాపూర్‌లో రైతులపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలో, ప్రపంచంలో నేరుగా రైతుల ఖాతాల్లో రైతుబంధు పథకం ద్వారా ఎకరానికి ఏడాదికి రూ.10 వేల చొప్పున ఎవరైనా జమచేశారని నిలదీశారు. కానీ, ఇప్పటివరకు 11 విడతల్లో రూ.72 వేల 815 కోట్లు జమచేసిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్‌దని వివరించారు. రైతుబీమా ద్వారా 1,11,320 మంది రైతు కుటుంబాలకు రూ.5,566 కోట్లు చెల్లించి ఆ కుటుంబాలకు భరోసా ఇచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.29,144.61 కోట్ల రుణ మాఫీ చేశామని, ఇలా దేశంలో ఏ ప్రభుత్వమైనా చేసిందా? అని మంత్రి నిరంజన్‌రెడ్డి నిలదీశారు. ఉమ్మడి పాలమూరు తలాపునే పారుతున్న కృష్ణానీటికి బీడుభూములకు రాకుండా ఎత్తగొడితే రైతుల పొలాల్లోకి ఎత్తిపోసిందే బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వమనే విషయం రైతన్నలకు తెలుసని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాహుల్‌గాంధీ నియోజకవర్గానికి ఒక సభ పెట్టినా కాంగ్రెస్ అధికారంలోకి రాదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీయేనన్నారు. నిందలు, ఆరోపణలతో ప్రజల మెప్పును పొందలేరని ఆయన స్పష్టంచేశారు.

ఓయూ విద్యార్థులు అడ్డా కూలీలు!

- చిల్లర ఖర్చులు ఇస్తే ఏదైనా చేస్తారు
- తార్నాక బార్‌లో బీర్ తాగి అరుస్తరు
- వాళ్లకు ఓ సిద్ధాంతం అనేది లేనేలేదు
- దారుణంగా అవమానించిన రేవంత్‌రెడ్డి
- ఓ చానల్ ఇంటర్వ్యూ వ్యాఖ్యలు వైరల్
- రేవంత్ వెంటనే క్షమాపణలు చెప్పాలి
- లేదంటే మా సత్తా ఏంటో చూపిస్తాం
- కాంగ్రెస్‌కు విద్యార్థి లోకం వార్నింగ్

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): నిన్న రైతులను బిచ్చగాళ్లంటూ ప్రేలాపనలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. ఉస్మానియా విద్యార్థులనూ ఘోరంగా అవమానించేలా వ్యాఖ్యలు చేశారు. ఉస్మానియా విద్యార్థులు అడ్డా మీది కూలీలని, ఖర్చులకు చిల్లర ఇస్తే అరుస్తూనే ఉంటరంటూ దారుణంగా మాట్లాడారు. ఇందుకు సంబంధించి ఓ చానల్ ఇంటర్వ్యూలో ఉస్మానియా విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ వీడియోలో ఓయూ విద్యార్థులను తీవ్రస్థాయిలో అవమానించేలా మాట్లాడటం గమనార్హం. ఇంటర్వ్యూ సందర్భంగా యాంకర్ 'ఉస్మానియా విద్యార్థులు యూనివర్సిటీకి రాహుల్‌గాంధీ రాకను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని అనుకుంటున్నారు' అంటూ రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానం చెప్తూ 'ఏం లేదు. ఉస్మానియా విద్యార్థులు కేటీఆర్ దగ్గరికి పోయి చిల్లర ఖర్చులకు తెచ్చుకొని ఉంటరు. ఇంకేముంది అ పక్కనే తార్నాకలో ఉన్న బార్‌లో ఓ బీర్ తాగి, బిర్యానీ తిని అది అరిగే వరకు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడి ఉంటరు. వాళ్లది ఏముంటది? అడ్డా మీది కూలీల్లాంటోళ్లు. వాళ్లకంటూ ఓ సిద్ధాంతం గానీ, వాళ్లకంటూ ఓ ఆలోచన గానీ, వాళ్లకంటూ తెలంగాణ పట్ల గౌరవం అంటూ ఏమీ లేవు' అని తన అహంకారాన్ని తెలియజేసేలా వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తన వ్యాఖ్యలతో కేవలం విద్యార్థులనే కాదు.. ఉస్మానియా యూనివర్సిటీనే అవమానించారంటూ విద్యార్థులు మండిపడుతున్నారు. తెలంగాణకే తలమానికమైన ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన అహంకారానికి నిదర్శమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అప్పుడు గుర్తులేదా రేవంత్?

ఓయూ విద్యార్థులపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై విద్యార్థి సంఘాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చరిత్ర మరిచి మాట్లాడటంపై మండిపడుతున్నారు. తన అవసరాల కోసం ఉస్మానియా విద్యార్థులను వాడుకున్నప్పుడు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ మేలు కోసం అక్కడి విద్యార్థులను ఎగదోసిన విషయాన్ని మర్చిపోయావా? అని నిలదీస్తున్నారు. కాంగ్రెస్ కోసం ఎంతగానో శ్రమించిన ఉస్మానియా విద్యార్థి నేత కురువ విజయ్‌కుమార్‌కు టికెట్ ఇస్తానని హామీ ఇచ్చి, మోసం చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఎంతోమంది ఉస్మానియా విద్యార్థులను వాడుకొని మోసం చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు తిరిగి అదే విద్యార్థులపై విచ్చలవిడిగా మాట్లాడటమా? అని తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

కాంగ్రెస్ లాఠీ దెబ్బలు మర్చిపోలేదు

ఉస్మానియా విద్యార్థులపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు విద్యార్థి లోకంలో మంట పుట్టిస్తున్నాయి. ఉద్యమాల పురిటి గడ్డపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే కాంగ్రెస్‌కు నాటి నుంచి ఓయూపై కక్ష సాధింపే ఉన్నది. తెలంగాణ ఉద్యమంలో ఓయూ, అక్కడి విద్యార్థులు ఎంత కీలక పాత్ర పోషించారో అందరికీ తెలిసిందే. ఎంత మంది విద్యార్థులు తెలంగాణ కోసం అసువులు బాసారు. అదే ఓయూలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులపై దమనకాండ సాగించింది. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులపై విచక్షణారహితంగా లాఠీలతో చావబాదారు. విద్యార్థులపై రబ్బర్ బుల్లెట్లు, బాష్పవాయు గోళాలను ప్రయోగించింది. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉస్మానియా విద్యార్థులపై విషం చిమ్మారు. ఉస్మానియా యూనివర్సిటీని, విద్యార్థులను అవమానించేలా మాట్లాడిన రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్తామని విద్యార్థి లోకం హెచ్చరించింది.

లోకం పోకడ



బిచ్చమా? చేతులు ఖాళీలేవు.. వెళ్లిరండి!

భారీ జరిమానా సబబు కాదు

- అది విద్యా లక్ష్యాన్ని దెబ్బతీస్తుంది
- ఓయూ తీరుపై హైకోర్టు విస్మయం

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): సకాలంలో ఫీజు చెల్లించని విద్యార్థులకు విధించే జరిమానా భారీగా ఉంటే దాని ప్రభావం విద్యా లక్ష్యాన్ని దెబ్బతీస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. పరీక్ష రాసేందుకు ఒకో సబ్జెక్టుకు రూ.10వేలు జరిమానా విధించడంపై విస్మయం వ్యక్తం చేసింది. 2017- 18 విద్యా సంవత్సరంలో డిగ్రీ విద్యార్థుల బ్యాక్‌లాగ్ పరీక్షలు రాయడానికి ఒక్కో సబ్జెక్టుకు రూ.10 వేలు జరిమానా చెల్లించాలన్న నిర్ణయాన్ని నాలుగు వారాల్లోగా సమీక్షించాలని ఉస్మానియా యూనివర్సిటీ స్టాండింగ్ కమిటీని హైకోర్టు ఆదేశించింది.

బీసీలను ముంచింది కాంగ్రెస్సే

- బీసీ సీట్లను రేవంత్‌రెడ్డి అమ్ముకున్నడు
- బడుగువర్గాలను కేసీఆర్ ఆదరించారు
- మరోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కారే
- బీఆర్‌ఎస్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, దాసోజు శ్రవణ్

మీడియాతో మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య, చిత్రంలో దాసోజు శ్రవణ్

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): బీసీలను ముంచింది కాంగ్రెస్సేనని బీఆర్‌ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య ధ్వజమెత్తారు. బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్న రాహుల్ ప్రకటన పచ్చి బూటకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్, నందికంటి శ్రీధర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పొన్నాల, దాసోజు మాట్లాడుతూ.. బీసీలు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాల సీట్లను రేవంత్‌రెడ్డి అమ్ముకున్నారని ఆరోపించారు. వీహెచ్, అంజన్‌కుమార్, నందికంటి శ్రీధర్, ఎర్ర శేఖర్, గండ్రాత్ సుజాత వంటి బీసీ నేతలకు ఇవ్వాల్సిన టికెట్లను రేవంత్ తన వర్గానికి ఇప్పించుకున్నారని మండిపడ్డారు. బీసీల టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ వారి ప్రయోజనల కోసం ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. కులగణన చేయాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఉండాలని పదేండ్ల క్రితమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ 20 మంది బీసీలకు టికెట్లు ఇస్తే 40 మంది రెడ్డి సామాజిక వర్గాకే ఇచ్చిందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ఇస్తుందని, బీసీ గర్జన చేపడతామని తెలిపారు.

పచ్చకాంగ్రెస్‌గా మార్చేశారు

కాంగ్రెస్ పార్టీని రేవంత్‌రెడ్డి పచ్చకాంగ్రెస్‌గా మార్చేశారని పొన్నాల, దాసోజు విమర్శించారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే రేవంత్ పనిచేస్తున్నారని ఆరోపించారు. రూ. 50 కోట్లకే పీసీసీ పదవి తెచ్చుకున్నాడని రేవంత్‌పై కోమటిరెడ్డి బ్రదర్స్ ఆరోపించినా.. రేవంత్ వారిపై తిరిగి ఆరోపణలు చేసినా తామంతా ఒకటే అన్నట్టు వ్యవహించారని పేర్కొన్నారు. బీసీలను అవమానాలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా పదవులు ఇవ్వడమే కాకుండా సామాజికంగా బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్నది బీఆర్‌ఎస్ పార్టీయేనని స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్ గెలుపు చారిత్రక అవసరం

- హ్యాట్రిక్ విజయం కోసం ఊరూరా ప్రచారం
- కార్పొరేషన్ చైర్మన్లు పిట్టల, పల్లె, దూదిమెట్ల బాలరాజువెల్లడి

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడటం చారిత్రక అవసరమని ఫిషరీస్ ఫెడరేషన్, కల్లుగీత, గొర్రెలు-మేకల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ల చైర్మన్లు పిట్టల రవీందర్ ముదిరాజ్, పల్లె రవికుమార్‌గౌడ్, డాక్టర్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం కోసం అన్ని వర్గాల ప్రజల మద్దతును కూడగట్టేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తామని వివరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరమున్నదని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి, ప్రత్యేక సమావేశాలను నిర్వహించి, పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరిస్తామని చెప్పారు. సంక్షేమ పథకాల ఫలితంగా అన్నిరంగాల్లో వచ్చిన గుణాత్మక మార్పును, సర్వతోముఖాభివృద్ధిని ప్రజలు తమ అనుభవంలో గమనిస్తున్నారని పేర్కొన్నారు.

రేవంత్‌ను నమ్మితే నోట్లో మన్నే

- ఆయనది భస్మాసుర హస్తం
- టికెట్లు అమ్ముకున్న ఘనుడు
- అతని బాగోతాలన్నీ దగ్గరుండి చూశా
- రేవంత్ నుంచి నాకు ప్రాణహాని
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు డాక్టర్ కురువ విజయ్‌కుమార్

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని పొరపాటున నమ్మితే రాష్ట్రాన్ని అమ్ముకుంటాడని, ప్రజల నోట్లో మన్ను కొడతాడని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు డాక్టర్ కురువ విజయ్‌కుమార్ విమర్శించారు. రేవంత్‌ది భస్మాసుర హస్తమని, ఆయన వల్ల కాంగ్రెస్ పార్టీ పుంజుకుందన్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి వందల కోట్లకు టికెట్లు అమ్ముకున్నాడని, ఆయన బాగోతాలను దగ్గరుండి చూశానని 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

కోట్ల రూపాయలు, భూములు రాయించుకొని రేవంత్‌రెడ్డి సీట్లు అమ్ముకున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి కదా?

అవి ఆరోపణలు కాదు. వాస్తవాలు. ఇప్పటివరకు ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో కొన్ని సీట్లు పక్కన పెడితే.. మిగతా అన్నీ స్థానాల్లో ఆ అభ్యర్థి ఎవరో ఇటు ప్రజలకు తెలియదు. అటు క్యాడర్‌కు తెలియదు. రూ.కోట్లు ఇవ్వకపోతే వాళ్లకు సీటెలా దక్కిందో మీరే ఆలోచించాలి.

నిజంగా ఈడీ విచారణ చేయాల్సిన స్థాయిలో సీట్ల పంపిణీలో లావాదేవీలు జరిగాయా?

కొన్ని వందల కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయి. భూముల బదలాయింపు జరిగింది. పారాచూట్ నేతలకు టికెట్లు దక్కడమనేది ఉత్తగనే జరగదు కదా? ఎన్నో ఏండ్లుగా పార్టీలో ఉన్నవాళ్లని కాదని, గెలిచే వాళ్లను పక్కనబెట్టి కొత్తవాళ్లకు సీట్లు ఎలా ఇస్తారు? డబ్బులు తీసుకొని కదా. విచారణ చేస్తే నిజం బయటపడుతుంది.

కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కష్టపడ్డ మిమ్మల్ని పార్టీలోంచి బహిష్కరించారు. కారణం?

ఇప్పుడు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి. ఇది ఎన్నికల సీజన్. రేవంత్‌రెడ్డికి మంచి బిజినెస్ టైమ్. ఆయన ఆడిన ఆటలు, వసూళ్లు అన్నీ దగ్గరుండి చూసినవాణ్ణి. వాస్తవాలు మాట్లాడుతుంటే తట్టుకోలేక పార్టీలోంచి సస్పెండ్ చేసి ఒక ముద్ర వేశారు.

రేవంత్‌రెడ్డి నుంచి ప్రాణహాని ఉన్నదని డీజీపీకి ఫిర్యాదు చేశారు. నిజంగా మిమ్మల్ని చంపే కుట్ర జరుగుతున్నదా?

నాకు రేవంత్ అనుచరులు, ఆయన ప్రైవేట్ సైన్యం నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. రాత్రి సమయంలో ఇంటిచుట్టూ గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్నారు. బయటకు వెళ్తే నా కారును ఎవరో ఆగంతకులు ఫాలో అవుతున్నారు. ఆ ఫోన్ నంబర్లు, వెహికిల్ నంబర్లతో సహా అన్నీ వివరాలతో డీజీపీకి ఫిర్యాదు చేశా.

రేవంత్ వల్ల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకున్నదా?

రేవంత్‌రెడ్డికి అంత సీన్ లేదు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, కర్ణాటక ఎన్నికలు, రాహుల్‌గాంధీ యాత్ర, ఉప ఎన్నికల వల్ల కాంగ్రెస్ క్యాడర్‌లో పార్టీని బతికించుకోవాలనే చైతన్యం వచ్చి పార్టీ యాక్టివేట్ అయింది తప్పితే.. రేవంత్‌రెడ్డి వల్ల కాదు. ఆయనకు అంత దమ్మే ఉంటే.. మునుగోడు, దుబ్బాక, హుజూరాబాద్, నాగార్జునసాగర్ ఉపఎన్నికల్లో పార్టీకి డిపాజిట్ కూడా ఎందుకు రాలేదు?

ప్రజలు రేవంత్‌రెడ్డిని నమ్మే పరిస్థితిలో ఉన్నారంటారా?

కాంగ్రెస్ పార్టీలో తిరిగిన చాలామంది ఇప్పటికీ రేవంత్‌రెడ్డిని నమ్మరు. ప్రజలేం నమ్ముతారు. పొరపాటున ఆయన మాయమాటలు నమ్మి, టీవీల్లో, సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలు, ఫొటోలు చూసి రేవంత్‌రెడ్డికి గనుక తెలంగాణను అప్పగిస్తే.. రాష్ట్రాన్ని అమ్ముకుంటడు. ప్రజల నోట్లో మన్ను కొడుతడు. కోట్లకు ఆశపడి సొంత పార్టీ నేతల గొంతు కోసిన రేవంత్‌రెడ్డి ప్రజల గురించి ఆలోచిస్తాడని, రాష్ట్రానికి ఏదో చేస్తాడని నమ్మొద్దు.

రేవంత్ కాంగ్రెస్‌ని మరో టీడీపీ చేస్తారనే వార్తలపై మీ కామెంట్?

ఆయన ఆరెస్సెస్ సుశిక్షిత కార్యకర్త. చంద్రబాబుకు నమ్మినబంటు. ఎప్పటికైనా కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్లి టీడీపీలో కలపడమో, కాంగ్రెస్ పేరు మార్చి టీటీడీపీ అని పెట్టడమో చేస్తాడు. ఎన్నికల ఫలితాల తర్వాత ఏమాత్రం తేడా వచ్చినా ఆయన సీట్లు కేటాయించుకున్న కోటరీతో కొత్త పార్టీ పెడతాడు.

మొన్నటి వరకు మీరు పనిచేసిన పీసీసీలో ప్రెసిడెంట్ మీద ఇంతలా విమర్శలు, దాడి చేయడానికి కారణం?

రంగులు మార్చే ఊసరవెల్లిని నమ్మొచ్చు. రక్తం మరిగిన పెద్దపులిని నమ్మొచ్చు. కాటు వేసే విషనాగులను నమ్మొచ్చు. అవి పరిస్థితులను బట్టి, ఆకలిని, భయాన్ని బట్టి ప్రవర్తిస్తాయి. కానీ రేవంత్ అలా కాదు. తన అవసరాల కోసం ఎవరినైనా వాడుకుంటాడు. తను ఎదగడం కోసం ఎవరినైనా తొక్కేస్తాడు. రేవంత్‌ది భస్మాసురహస్తం. చేయందించాడని సంబరపడేలోపే.. బూడిదగా మారిపోతాం. ప్రస్తుతం ఎంతో మంది కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆ బాధను అనుభవిస్తున్నారు. ఆ బాధితుల్లో నేనూ ఒకడిని. విమర్శ చేయకుండా, దాడి చేయకుండా ఎందుకుంటా?

మీకు టికెట్ ఇస్తే.. ఇవన్నీ బయటకు చెప్పేవారా?

చాలా మంచి ప్రశ్న అడిగారు. టికెట్ ఇస్తే చెప్పేవాడిని కాదేమో.. ఇవ్వలేదు కాబట్టే ఇలా మాట్లాడుతున్నానేమో అని అనుకోవడం సహజం. ఈరోజు రేవంత్ గురించి మాట్లాడుతున్న వారంతా టికెట్ ఇవ్వలేదనో, మోసపోయామనో కాదు. గతంలో కూడా చాలా ఎన్నికల్లో టికెట్ రాలేదు. అవకాశాలు రాలేదు. కాంగ్రెస్ అనే పార్టీని వేదికగా చేసుకొని తన లోని ఫ్యూడలిస్టును బయటపెట్టాడు. పార్టీ నాయకులకే అన్యాయం చేస్తున్నాడు. రేపు ప్రజలను అమాయకులను చేసి.. అడుక్కు తినేలా చేస్తాడేమో అనే భయంతో చెప్తున్నా. దయచేసి తెలంగాణ ప్రజలందరికీ దండం పెట్టి చెప్తున్నా. రేవంత్‌రెడ్డిని, ఆయన మాటలను నమ్మొద్దు. ఒకవేళ గుడ్డిగా నమ్మితే.. నోట్లో మన్ను కొట్టి సర్వనాశనం చేస్తాడు.

కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

టికెట్లు అమ్ముకొన్న రేవంత్‌రెడ్డి

- ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్లు
- డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 1 : పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకొన్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆరోపించారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న నేతలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. హనుమకొండలోని జక్రియ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వరంగల్ పశ్చిమ ఆత్మీయ సమ్మేళనంలో రాఘవరెడ్డి మాట్లాడుతూ.. 30 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేశానని తెలిపారు. ప్రజలకు అండగా ఉండి పోరాటం చేసేవారికి కాకుండా, కాంగ్రెస్ పార్టీలో ఉండి ద్రోహం చేసేవారికి టికెట్లు అమ్ముకున్నాడని మండిపడ్డారు. డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నప్పుడు 156 కేసులు నాపై పెట్టినా ఒక్కరోజు భయపడకుండా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని గుర్తుచేశారు. ప్రజాదరణ ఉన్న నాపై అధిష్ఠానం మరోసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. టికెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని రాఘవరెడ్డి హెచ్చరించారు.

బీసీలకు రేవంత్ మొండి 'చేయి'

- ఇటువంటి పీసీసీ అధ్యక్షుడిని జీవితంలో చూడలేదు
- పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈర్ల కొమురయ్య
- కాంగ్రెస్ పార్టీకి రాజీనామా



ఖైరతాబాద్, నవంబర్ 1: రాష్ట్ర కాంగ్రెస్‌లో బీసీ నేతలకు రేవంత్ మొండి 'చేయి' చూపారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి నేత ఈర్ల కొమురయ్య విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీకి, తన సభ్యత్వానికి రాజీనామా చేసిన అనంతరం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడగొట్టడమే ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మొత్తం అగ్రవర్ణాల పార్టీగా మారిపోయిందని మండిపడ్డారు. అభ్యర్థిత్వం కోసం దరఖాస్తుకు రూ.50 వేల చొప్పున కోట్లాది రూపాయలు వసూలు చేశారని, దీనికి తోడు కోట్లు చెల్లించిన వారికే టికెట్లు ఇచ్చారని విమర్శించారు. దీనికి బదులు టెండర్లు పెడితే బాగుండేదని ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కాంగ్రెస్‌కు దూరమవుతున్నారని, ఇప్పటికే అనేక మంది పార్టీని వదిలి వెళ్లిపోయారని తెలిపారు. సునీల్ కనుగోలుతో దొంగ సర్వేలు చేయించి డబ్బులెక్కువ ఇచ్చిన వారికే టికెట్లు కేటాయించారని ధ్వజమెత్తారు. టీడీపీ నుంచి నాయకులను డంప్ చేసుకొని వారికి టికెట్లు అమ్ముకున్నాడని ఆరోపించారు. దీనిపై సీనియర్లు ప్రశ్నిస్తే ఉంటే ఉండండి లేకపోతే పోండని ముఖం మీదే చెబుతూ దబాయిస్తున్నాడని తెలిపారు. ఇటువంటి పీసీసీ అధ్యక్షుడిని తన జీవతంలో చూడలేదని, రేవంత్ కాంగ్రెస్‌కు పట్టిన దరిద్రమని విమర్శించారు. రేవంత్ వల్లే కాంగ్రెస్‌ను వీడాల్సి వస్తున్నదని కన్నీటి పర్యంతమయ్యారు.

కాంగ్రెస్‌తో లెఫ్ట్ పొత్తు హుళక్కి!

- ఒంటరిగా 15 సీట్లలో సీపీఎం పోటీ
- కాంగ్రెస్ నిర్ణయం కోసం ఎదురుచూస్తామన్న సీపీఐ

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌తో వామపక్షాల పొత్తు బెడిసికొట్టినట్టు తెలుస్తున్నది. వామపక్షాలు తాము కోరిన సీట్లపై కాంగ్రెస్‌కు విధించిన గడువు బుధవారంతో ముగిసింది. అయినప్పటికీ కాంగ్రెస్ నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. ఈ నేపథ్యంలో సీపీఐ, సీపీఎం బుధవారం వేర్వేరుగా రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను నిర్వహించాయి. తాము కోరిన మిర్యాలగూడ, వైరా స్థానాలపై కాంగ్రెస్ ఎటువంటి హామీ ఇవ్వకపోవడంతో ఒంటిపోరుకు వెళ్లాలని నిర్ణయించిన సీపీఎం.. 15 స్థానాల్లో పోటీ చేయాలని తీర్మానించింది. ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో 9 స్థానాలతో పాటు ఇబ్రహీంపట్నంలోనూ బరిలో ఉండాలని నిర్ణయించింది. ఇవి కాకుండా మరో ఐదు స్థానాలను గుర్తించి మొత్తం 15 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాలని యోచిస్తున్నట్టు తెలిసింది. కాంగ్రెస్‌తో పొత్తు ఉండేదీ, లేనిదీ గురువారం ప్రకటిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు.

ఎటూ తేల్చుకోని సీపీఐ

ఒంటరి పోరుకు వెళ్లాలని సీపీఎం నిర్ణయించగా సీపీఐ మాత్రం ఇంకా ఎటూ తేల్చుకోలేకపోతున్నది. ఒకవేళ సీపీఐతో కూడా కాంగ్రెస్ పొత్తు కుదరకుంటే లెఫ్ట్ పార్టీలు ఉమ్మడిగా బరిలోకి దిగే అవకాశం ఉంది. తాము అడిగిన సీట్లు ఇస్తారన్న నమ్మకం ఉన్నదని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా చెప్పారు. సీట్ల కేటాయింపుపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ మాట నిలబెట్టుకుంటుందని భావిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.

జనగామ కాంగ్రెస్‌లో ముసలం

- కొమ్మూరి తీరుపై గిరిజన నేతల అసమ్మతి
- రహస్యంగా 30 మందికి పైగా నాయకుల సమావేశం

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 1: జనగామ కాంగ్రెస్ పార్టీలో ముసలం పుట్టింది. కిందిస్థాయి నాయకత్వాన్ని పట్టించుకోవడం లేదని పలువురు ఆ పార్టీ నేతలు కినుక వహించారు. ధూళిమిట్ట మండలంలోని ఉమ్మడి కొండాపూర్ గ్రామానికి చెందిన పలువురు గిరిజన నేతలు అసమ్మతి గళం వినిపిస్తున్నారు. బుధవారం ఓ రహస్య ప్రదేశంలో 30 మందికి పైగా కాంగ్రెస్ గిరిజన నేతలు సమావేశమైనట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఒంటెద్దు పోకడలకు పోతున్నారని గిరిజన నేతలు ఆరోపించారు. ఆయన తీరుపై మండిపడ్డారు. ఉమ్మడి కొండాపూర్ గ్రామంలో సుమారు 3వేలకు పైగా గిరిజన ఓట్లు ఉన్న తమకు పార్టీలో ఎలాంటి ప్రాధాన్యం కల్పించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకు సరైన గుర్తింపు ఇవ్వకపోతే మూడు రోజుల్లో తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపినట్లు సమాచారం. కాగా, ఈ విషయం కాస్త బయటకు పొక్కడంతో కాంగ్రెస్ గ్రామ కమిటీని వేసేందుకు సమావేశమైనట్టు పలువురు నాయకులు సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతూ కవరింగ్ ఇవ్వడం కొసమెరుపు.

చలికాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	37.4°c	16.4°c
ఆదిలాబాద్	34.8°c	16.4°c
నల్లగొండ	33.9°c	20.2°c
మహబూబ్‌నగర్	33.6°c	23.4°c
మెదక్	33.0°c	17.3°c
ఖమ్మం	33.0°c	23.0°c
నిజామాబాద్	32.6°c	19.2°c
వరంగల్	32.0°c	20.0°c
కరీంనగర్	31.0°c	21.0°c
హైదరాబాద్	30.7°c	22.1°c

నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్‌లో..

గోరఖ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- ఖాళీలు:142
- పోస్టులు: ట్యూటర్ /క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ల్యాబ్ అటెండెంట్, మెడికల్ సోషల్ వర్కర్, లోయర్ డివిజన్ క్లర్క్, తదితరాలు
- అర్హత: పోస్టును బట్టి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 21
- వెబ్‌సైట్: https://aiimsgorakhpur.edu.in

సీడాక్‌లో..

బెంగళూరులోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- ఖాళీలు: 90
- పోస్టు: ప్రాజెక్ట్ ఇంజినీర్
- అర్హతలు, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరి తేదీ : నవంబర్ 17
- వెబ్‌సైట్: https://www.cdac.in

పీజీసీఐఎల్‌లో..

న్యూఢిల్లీలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ క్లాట్ స్కోర్ ద్వారా కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- ఖాళీలు: 10
- పోస్టు: ఆఫీసర్ ట్రైనీ (లా)
- అర్హత, ఎంపిక తదితర వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 9
- వెబ్‌సైట్: www.powergrid.in.

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- పాలిటీ, ఫిజిక్స్ (గ్రూప్స్), సోషల్ స్టడీస్ (డీఎస్సీ) మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.